
మహదేవపూర్ : ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు


మల్హర్ : కొయ్యూర్‌లో కవర్లు కప్పుతున్న రైతులు


పలిమెల : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

# అకాల వర్షంతో రైతుల ఆందోళన

- తుఫాన్ ప్రభావంతో వానలు
- చేతికొచ్చిన వరి, పత్తి పంటలు
- తడిసి నష్టపోతామని అన్నదాతల ఆవేదన

మహదేవపూర్, డిసెంబర్ 5 : మండల కేంద్రంతో పాటు బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లి, సూరారం, అంబట్‌పల్లి, రాపల్లికోట, ఎడపల్లి, కుదురుపల్లి, ఎల్కేశ్వరం, బెగ్లూర్, పెద్దంపేట, ఎన్కపల్లి గ్రామాల్లో మంగళవారం స్వల్ప వర్షం కురిసింది. అకాల వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ మొత్తంలో వరిపంట కోత దశకు చేరుకోవడంతో వర్షానికి తడిసి ధాన్యం నేలరాలుతుందని దిగులుపడుతున్నారు. కొన్ని చోట్ల పంట కోసి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పారు. ఆరుగాలం కష్టపడి పండిస్తే ఆకాల వర్షంతో తమకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

### మల్హర్‌లో..

మల్హర్ : తుఫాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం ఉదయం నుంచి పలు గ్రామాల్లో చిరు జల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి పండించిన వరి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు పడడం వల్ల తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తరలించిన రైతులు ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్నారు.

### కాటారంలో..

కాటారం : తుఫాను ప్రభావంతో అకాల వర్షం పడటంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం తెల్లవారు జామున, మధ్యాహ్నం చిరు జల్లులు పడటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యంపై పరదాలు కప్పారు. ఆకాశం మేఘావృతమై ఉండటం, రెండు రోజుల పాటు తెలంగాణకు వర్ష సూచన ఉందని అధికారులు ప్రకటించడంతో రైతులు ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట పూర్తిగా చేతికందే సమయంలో వర్షం పడుతుండడంతో నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెందుతున్నారు.

### మహాముత్తారంలో..

మహాముత్తారం : మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు కవర్లు కప్పారు. చాలా మేరకు వరి పొలాలు కోతకు సిద్ధంగా ఉండటంతో ధాన్యం రాలిపోయి నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### చిట్యాలలో..

చిట్యాల : తుఫాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. దీంతో చలి తీవ్రత ఎక్కువ కావడంతో వ్యవసాయ పనులకు వెళ్లాల్సిన రైతులు, కూలీలు ఇంటికే పరిమితమయ్యారు. చేతికొచ్చిన వరి, పత్తితో పాటు మిర్చి పంట తడిసిపోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### కొనుగోలు కేంద్రం పరిశీలన

పలిమెల : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ హేమ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల బాధ్యులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో ప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులున్నారు.

## బీఆర్‌ఎస్‌ను ఆదరించిన ఓటర్లకు ధన్యవాదాలు

పలిమెల, డిసెంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఇచ్చిన మండల ప్రజలకు పార్టీ మండలాధ్యక్షుడు జువ్వాజి తిరుపతి ధన్యావాదాలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో బ్రిడ్జిలు పూర్తిచేసి రవాణా సౌకర్యాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మెరుగుపర్చిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాలేదని ప్రజలు అధైర్య పడొద్దన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో యూత్ అధ్యక్షుడు లంగారి రవీందర్, సర్పంచ్ అల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జువ్వాజి తిరుపతి

## 7 వరకు టెన్త్ పరీక్ష ఫీజు గడువు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 5 : పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువును డిసెంబర్ 7 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 ఆలస్య రుసుంతో 14 వరకు, రూ. 200తో 21 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో జనవరి 3 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. జిల్లాలో ఇంత వరకు ఫీజు చెల్లించని పదో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీఈవో కోరారు.

## నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

మల్హర్, డిసెంబర్ 5 : రైతులు పండించిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ప్రాథమిక సహకార సంఘం సీఈవో సంతోష్ ఓక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో 11, కేడీసీసీ ఆధ్వర్యంలో 11 ప్రారంభించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, కామన్‌కు రూ. 2,183 మద్దతు ధర పొందాలని కోరారు.

## విద్యార్థుల సంఖ్యను పెంచాలి


మాట్లాడుతున్న ఎంఈవో రఘుపతి

చిట్యాల, డిసెంబర్ 5 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) కోడెపాక రఘుపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ కృష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

## నేడు బుగులోని జాతర హుండీల లెక్కింపు

రేగొండ, డిసెంబర్ 5 : బుగులోని జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని తిరుమలగిరి శివారు పాండవుల గుట్టలపై నవంబర్ 26 నుంచి డిసెంబర్ 1 వరకు బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర జరిగింది. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు లెక్కింపు జరుగుతుందని ఈవో తెలిపారు.


నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మహదేవపూర్, డిసెంబర్ 5 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. మురుగు నీరు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రమ్ములు, గోళాల్లో నిల్వ ఉన్న నీటిని వైద్య సిబ్బంది పారబోశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ. బ్రీడింగ్ చెక్కర్ సుధాకర్, ఆశ కార్యకర్త సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధాకర్

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల, డిసెంబర్ 5 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే చెప్పకూడదని, మొబైల్‌లో అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. పిల్లలు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడకుండా తల్లిదండ్రులు నిఘా పెంచాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

## తుఫాన్‌తో నష్టం జరుగకుండా చూడాలి

- ధాన్యం తడువకుండా రైతులకు టార్పాలిన్లు ఇవ్వాలి
- అధికారులను ఆదేశించిన భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 5 : తుఫాన్ వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానకాలం 2023–24 సంవత్సరం ధాన్యం కొనుగోళ్లు, మిగ్‌జాం తుఫాన్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు టార్పాలిన్లు అందించి ధాన్యం తడవకుండా చూడాలన్నారు. కొనుగోలుకు సంబంధించి ఎలాంటి అటంకాలు, సమస్యలు రాకుండా చూడాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీఎస్‌సీ డీఎం రాఘువేందర్, డీసీఎస్‌వో, అధికారులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు

## ఉపాధి పనులపై జడ్పీ సీఈవో సమీక్ష

రేగొండ, డిసెంబర్ 5 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై మండలంలోని కొడవటంచలో జిల్లాలోని ఎంపీడీవోలతో జడ్పీ సీఈవో విజయలక్ష్మి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు పనులు ఏ మేరకు జరిగాయి? ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు ఎన్ని బ్యాగులు సిద్ధం చేశారనే విషయం తెలుసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు సురేందర్, అంజనేయులు, నర్సింహమూర్తి, శంకర్, రామయ్య, అరుంధతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జడ్పీ సీఈవో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

VISWAMBHARA
COLLEGE OF EDUCATION
Approved by NCTE and Affiliated to Kakatiya University, Warangal
Khammam Road, Bollikunta, Khila Warangal (Mandal), Warangal-506 005, Telangana State
ADMISSION NOTIFICATION FOR B.ED B-CATEGORY SEATS
Candidates seeking admission in to **B.Ed** course under B-Category seats for the **Academic Year 2023-24** should apply in the prescribed application form available in the college office on all working days. Last date for submission of application is **05:00pm on 15.12.2023**. Admissions will be made as per the guidelines issued by TSCHE.
Date:05.12.2023
Sd/- Secretary & Correspondent
Contact No.s: 9948262646, 9440556304 8886536969